# హతోస్మి!

ఎ. రాజరాజేశ్వరి

వారంరోజులుగా దగ్గుతో బాధపడుతున్న ఆదిలక్ష్మికి ఆరోజు కొంచెం జ్వరంగా కూడా అనిపించి ఒళ్లు వెచ్చబడింది. పని చేయించే మనిషికి అనారోగ్యం అనిపిస్తే రెండురోజులు విశ్రాంతి తీసుకుని శక్తి పుంజుకుంటారు. కానీ పని చేసే యంత్రానికే సమస్య వస్తే? దానిమీద ఆధారపడ్డవారి మనుగడ ప్రశ్నార్థకమే! ఆదిలక్ష్మి యంత్రం కాకపోయినా శ్రీనివాసరావు పాలిట అన్నీను. భార్యగా అతని జీవితంలోకి ప్రవేశించిన క్షణం నుండీ అంతా తానే అయింది. పెళ్ళయి ఆరునెలలు తిరిగేసరికి అత్త మెచ్చిన కోడలయి, పొలం అజమాయిషీలు, డబ్బు లావాదేవీలతోపాటు మొత్తం పెత్తనమంతా చేజిక్కించుకుని ఎవరితోనూ మాట పడకుండా అందరితో శభాష్ అనిపించుకుని తమ ఆస్తులను తామరతుంపరలా పెంచింది.

అంతేకాదు, ఆమె తన జీవితంలోకి అడుగుపెట్టినప్పటి నుండీ ఉద్యోగంలో పదోన్నతి పొందుతూ మంచి పొజిషన్‌లోకి రావడంతో ఆమె ఆదిలక్ష్మి కాదు తన పాలిట ధనలక్ష్మి అన్న నమ్మకం ఏర్పడిపోయి తన జీతాన్ని, జీవితాన్ని ఆమె చేతుల్లో పెట్టి నిశ్చింతగా ఉన్నాడు.

ఆదిలక్ష్మి అయిదుగురు పిల్లలకి తల్లయినా చాలా ఆరోగ్యంగా, చలాకీగా ఉంటుంది. తన ఉద్యోగంవలన పిల్లల చదువుల కోసమని పొలాలు అమ్మేసి నగరంలో నడిబొడ్డున మంచి ఇల్లు కట్టించి పిల్లలందర్నీ అభివృద్ధిలోకి తేవడమే కాకుండా అందరికీ పెళ్లిళ్లు చేసి బాధ్యతల బరువుని తలమీంచి సునాయాసంగా దింపేసింది.

ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు విసిరేసినట్టుగా తలొక చోటా ఉన్నారు. ఆఖరి కూతురు రమ పెళ్లి కూడా ఆరునెలల క్రితమే జరిగి ఆమె కూడా అత్తవారింటికి వెళ్లిపోవడంతో ఇప్పుడిప్పుడే ఒంటరితనానికి అలవాటుపడి తనూ, తన భార్య ఒకరికొకరు ఒకరు బ్రతుకుతున్నారు. తనకి ఏ లోటూ చేయకుండా కంటికి రెప్పలా చూసుకునే భార్య అంటే అతడికి వల్లమాలిన అభిమానం. ఆమెకి ఏమాత్రం అనారోగ్యం వచ్చినా అశ్రద్ధ చేయక డాక్టర్ దగ్గరకు వెళదామని పోరుతాడు. కానీ ఆమె వినిపించుకోక 'ఇంత మాత్రానికే డాక్టరెందుకు?' అని చిట్కా వైద్యాలు పాటిస్తుందిగానీ హాస్పిటల్ మెట్లు ఎక్కడానికి ఇష్టపడదు.

వారంరోజులయినా దగ్గు తగ్గకపోవడంతో భర్త పోరు పడలేక డాక్టర్ దగ్గరకు వచ్చింది. డాక్టర్ ఆమెను పరీక్షించి ఎక్స్‌రే, బ్లడ్‌టెస్టు వ్రాసారు.

"వేడి చేసి దగ్గుతుంటే ఎందుకింత హంగామా? డబ్బులకోసం డాక్టర్లు ఉన్నవీ లేనివీ చెప్తారు. ఈ టెస్టు లేమీ అవసరంలేదు. మందులొకటీ వ్రాయమనండీ చాలు" అని విసుక్కుంది. అతడు ఆవిడ మాటలేం పట్టించుకోక డాక్టర్ వ్రాసిచ్చిన టెస్టులన్నీ చేయించాడు.

"నువ్విక్కడే కూర్చో. డాక్టర్‌కి రిపోర్టు చూపించి వస్తాను" అని ఆమెను బయట కూర్చోబెట్టి అతడు కన్సల్టింగ్ రూమ్‌లోకి వెళ్లాడు.

కొంచెంసేపటికి శ్రీనివాసరావు బయటకొచ్చాడు.

"పద ఆదిలక్ష్మి... నువ్వన్నట్టుగానే టెస్టులు చేయించడం దండుగ. రిపోర్టులన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. వర్రీ అవ్వాల్సిన పనిలేదు. మందులు వ్రాసిచ్చారు. నాలుగురోజులు వాడితే దగ్గు దెబ్బకి పారిపోతుంది" అన్నాడు నవ్వుతూ.

ఆమె జీవంలేని నవ్వొకటి నవ్వి అతడిని అనుసరించింది. ఒంట్లో నుండి శక్తినీ, రక్తాన్ని తోడేసినట్టుగా పాలిపోయి ఉన్న ఆమెను చూసి కంగారుపడ్డాడు.

"ఏమయింది? అంత నీరసంగా ఉన్నావు. ఏమయినా తాగుతావా?" అని అడుగుతున్న అతడి మాటలకు వద్దన్నట్టుగా తలాడించింది.

ఎప్పుడూ ఏదో ఒకటి గలగలా మాట్లాడే ఆమె ఆమె తన స్వభావానికి విరుద్ధంగా చలనం లేనట్టుగా ఉదాసీనంగా ఉండడం చూసి ఇంకేమనలేక అతడుకూడా మౌనాన్ని ఆశ్రయించాడు.

ఇంటికి వచ్చాక కూడా ఆమె ధోరణిలో మార్పులేదు. ఊరికే కన్నీరు కార్చడం. ఏమయినా అడిగితే శూన్యంలోకి చూడడం, తనలో తాను గొణుక్కోవడం..! అకస్మాత్తుగా ఏమయింది ఈమెకి? ఎలా ఈమెను మామూలు స్థితికి తీసుకురావడం? అతడికేమీ పాలుపోలేదు.

శ్రీనివాసరావుకు ఏనాడూ వంటగదిలోకి అడుగుపెట్టే అవకాశం కలగలేదు. భార్యకి వేళకి వండి పెడితే తినడమేతప్ప దాని వెనుకున్న కష్టం అతనికి తెలియదు. ఇప్పుడామె మంచం దిగక దాన్నే అంటిపెట్టుకుని గడుపుతోంది. మందులు వేసుకోమన్నా అనాసక్తిగా పక్కన పడేసి గది పైకప్పులకేసి చూస్తూ దీర్ఘాలోచనల మునిగిపోతోంది.

పోనీలే... ఆవిడకి రెస్టుగా వుంటుందనిపించి పనిమనిషి సాయంతో ఉడకేస్తున్నాడు. కాఫీ పెడుతుంటే పొరపాటున వేడిగా ఉన్న పాలగిన్నె పట్టేసుకుంటే చేయి కాలిపోయినా తనకి పట్టనట్టు నిర్లిప్తంగా మొహం తిప్పుకుని గోడవైపు తిరిగి పడుకుంది.

అతడికి చేయి కాలిన బాధకంటే భార్య ఉదాసీనత ఎక్కువగా బాధించసాగింది. మందులు దగ్గరుండి బలవంతాన మింగిస్తే దగ్గు బాగానే కంట్రోలయింది కానీ ఆమె వైఖరిలో లేశమాత్రపు మార్పులేదు. పెడితే తినడం, ఏమయినా అడిగినా నిస్తేజంగా చూడడం. ఇంక రెండురోజులు గడిచేసరికి దగ్గు తగ్గిపోయి శారీరకంగా కోలుకున్నా మానసికంగా కృంగిపోసాగింది. ఇక లాభంలేదనుకుని ఆమె ఆరోగ్య సమస్య తెలియజేస్తూ పిల్లలకు ఫోన్ చేసాడు.

"తక్షణం బయలుదేరుతున్నాం. కంగారుపడ

కండి'' అని పిల్లలు అనడంతో అతడికి జవసత్వాలు వచ్చినట్లయింది.

ఆ సంగతి విన్నాక ఆదిలక్ష్మి మొహంలో వెలుగు తొంగి చూసింది.

'ఓహో...పిల్లల మీద దిగులా? ఆ మాట చెప్పుంటే ఎప్పుడో రప్పించేవాడినికదా. ఇంతగా తనని భయపెట్టాలా?' అనుకుని తేలిగ్గా నిట్టూర్చాడు.


***

ఆ మర్నాడే పిల్లలంతా దిగారు. తమని చూసి మౌనంగా కన్నీరు కారుస్తున్న తల్లి పరిస్థితికి తల్లడిల్లిపోయి బావురుమన్నారు.

"ఏమయిందమ్మా? ఇలా అయిపోయావు? నీ అనారోగ్యం ఏమిటి? " అంటున్న పిల్లల ప్రశ్నలకు జవాబివ్వకుండా శూన్యంలోకి చూడసాగింది.

అమ్మను చూస్తుంటే మాకు ఆశ్చర్యంగా, భయంగా ఉంది. అనారోగ్యం ఎరుగని మనిషి? ఏమయింది ఆవిడకు? డాక్టర్లు ఏమన్నారు? ఆవిడ గురించి ఇప్పుడా చెప్పడం మాకు?

కొడుకులు తనమీద మాటల దాడి చేయడంతో శ్రీనివాసరావు కంట్లో పల్చటి నీటిపొర అడ్డం పడింది.



"నిజం చెబుతున్నానురా... అమ్మకి దగ్గు, కొద్దిగా జ్వరం తప్ప ఎలాంటి అనారోగ్యంలేదు. ఆవిడ రాను పొమ్మంటున్నా బలవంతాన డాక్టర్‌కి చూపించి అతడు వ్రాసిచ్చిన టెస్టులు చేయించితే అంతా నార్మల్ ఏమీలేదనీ, ఎలర్జీవల్ల దగ్గువచ్చింది, నాలుగురోజులు యాంటీబయాటిక్సు వాడితే తగ్గిపోతుందన్నారు."

అక్కడ ఆదిలక్ష్మి గదిలో ఆమె కూతుళ్లు, కోడళ్లు ఆమె చుట్టూ చేరి ప్రశ్నలతో వేధిస్తున్నారు.

"మేము టెన్షన్ పడి అంత దూరం నుండి పరుగెత్తుకొచ్చాం. ఏమడిగినా మాట్లాడవేమిటి? ఏమీ చెప్పకపోతే ఈ రోజే ఊరికి వెళ్లిపోతాం" అన్నారు బెదిరిస్తూ.

ఆదిలక్ష్మి లేచి కూర్చుని తన నగల పెట్టె తెమ్మని ఏదో కొన్ని నగలు తప్ప అందరికీ సమానంగా పంచేసి "ఈ మిగిలిన నగలు నేను పోయాక సమానంగా తీసుకోండి" అంది.



## తిరిగి నటిస్తున్నారు

అమితాబ్-షారుఖ్‌లు కలిసి ఇప్పటి వరకూ మూడు సినిమాలు చేసారు. మొబ్బతేం, కభీ కుషీ కభీ గమ్, కంక్. ఈ మూడూ విజయం సాధించాయి. అయితే ఇద్దరి మధ్యా ఏవో 'తేడాలు' వచ్చాయని ఇక కలిసి నటించరని కొంత కాలంగా వార్తలు వినిపిస్తూనే వున్నాయి. కానీ అతి త్వరలోనే వీళ్లిద్దరూ 'హ్యాపీ న్యూ ఇయర్' అనే సినిమా చేయబోతున్నారని బాలీవుడ్ హాటెస్ట్ న్యూస్. ఈ సినిమాకి షారుఖ్ బెస్ట్ ఫ్రెండ్ ఫరా ఖాన్ దర్శకత్వం వహిస్తుందిట.




తల్లి నగలు పంచేసి అప్పగింతలు పెట్టడంతో అంతా గొల్లుమన్నారు. ఎప్పటికైనా వారికి చెప్పక తప్పదనుకున్న ఆమె తన మనసులోని మాటని, బాధని వారికి చెప్పుకుంది.

సంగతి తెలియగానే చిన్న కూతురు రమ సుడిగాలిలా తండ్రివద్దకు దూసుకొచ్చింది.

"అమ్మకింత తీవ్రమైన జబ్బు చేస్తే ట్రీట్‌మెంట్ ఇప్పించక, అసలు విషయం మాతో చెప్పకుండా ఏమీ లేదంటూ మమ్మల్ని మభ్యపెడతావా నాన్నా" అంటూ తనని నిందిస్తున్న కూతురివైపు అయోమయంగా చూసాడు.

"అమ్మకి జబ్బా? ఏం జబ్బు?" అని అడుగుతున్న తండ్రివైపు కోపంగా చూసింది.

"అమ్మకి క్యాన్సర్ ముదిరిపోయి అడ్వాన్సు స్టేజీలో ఉందని, ఆపరేషన్‌కి, మందులకు లొంగదనీ, అయినవాళ్లకి కబురు చేయమని నీతో చెబితేనే కదా సంగతి దాచిపెట్టి మమ్మల్ని అందర్నీ పిలిపించావు. ఎంత మోసం చేసావు నాన్నా" కూతురి తీవ్రమైన ఆరోపణలకు బిగుసుకుపోయాడు.

ఎలాగో తేరుకుని "ఏమిటీ... అమ్మకు కేన్సరా? ఎవరు చెప్పారు నీకు? ఇప్పటివరకూ నాకు కూడా తెలియదు" అతడి గొంతు వణుకుతోంది.

"డాక్టర్ నీతో చెప్పడం, అమ్మ చెవులారా వింది. కంటి తుడుపుకి నాలుగురోజులు ఏవో మందులు వాడి ఏమీలేదని దాటేస్తున్నావు?"

"డాక్టర్ మీ అమ్మకు జబ్బు వుందని నాతో చెప్పాడా? ఏం చెప్పాడో ఆవిడనే అడుగుదాం పద" అంటూ భార్య గదిలోకి వచ్చాడు.

అతడికి జీవితంలో మొదటిసారిగా ఎప్పుడూ రానంత కోపం వచ్చింది. ఉన్నవీ లేనివీ చెప్పి పిల్లల ముందు తనను దోషిలా నిలబెట్టిన ఆమెను కోపంగా అడిగాడు.

"పిల్లలకు లేనిపోనివి చెప్పి మమ్మల్ని ఇంతగా బాధపెట్టి మా మతులు చెడగొడతావా? ఏంటి నీ ఉద్దేశ్యం? ఇంతవరకూ తెలివైనదానివనుకున్నాను. కానీ వట్టి మూర్ఖురాలివని తేలిపోయింది. నిక్షేపంలా పిడిరాయిలా వున్న నీకు లేని రోగం చెప్పి మెంటల్ టార్చర్ పెట్టిన ఆ డాక్టర్ ఎవరు? వాడిమీద పరువు నష్టం దావా వేసి డిగ్రీ పట్టా రద్దు చేయిస్తాను."

ఆవేశంతో రంకెలేస్తున్న భర్తని చూసి ఆదిలక్ష్మి భయపడిపోయింది. ధైర్యాన్ని, మాటలను కూడదీసుకుంటూ అంది "ఆ రోజు నన్ను బయట కూర్చోబెట్టి డాక్టర్‌కి రిపోర్టు చూపిస్తానని లోపలకు వెళ్లారుకదా. డాక్టర్ మీతో ఏమన్నాడో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. నేను కూడా లోపలకు వద్దామని లేచి డోరు వద్దకు వచ్చాను. అప్పుడు డాక్టర్ మాటలు వినబడ్డాయి.

'లాభంలేదు. చాలా ఆలస్యమైపోయింది. బ్రెస్టు క్యాన్సర్. బాగా ముదిరిపోయి బ్రెస్టుకే కాక మిగిలిన అవయవాలకు కూడా వ్యాపించింది. మీరు చేసిన ఈ నిర్లక్ష్యం ఖరీదు ఒక నిండు ప్రాణం. ట్రీట్‌మెంట్ ఇప్పించినా డబ్బు దండగ తప్ప ఫలితం ఉండదు. మహా బ్రతికితే వారం పదిరోజులు అంతే. అయినవాళ్లను పిలిపించుకుంటే కడసారి చూసుకుంటారు. కాదూ కూడదూ అనుకుంటే మీ తృప్తికోసం హాస్పిటల్‌లో జాయిన్ చేయండి. లేందటే ఇంటిదగ్గరే అయినవాళ్ల మధ్య గడపదలచుకుంటే మందులు వ్రాసిస్తాను' అన్నాడు. నేను విన్నది అబద్ధమా?"

భార్య మాటలు విన్నాక అంతవరకూ పడుతున్న టెన్షన్ చేత్తో తీసేసినట్లయి పెద్దపెట్టున నవ్వాడు.

అంత ఖచ్చితంగా చెబుతున్న తల్లి మాటలకు "అవును నిజమే. ఈ విషయం మీతో చెప్పలేకపోయాను. నన్ను క్షమించండి" అని అతడు దుఃఖిస్తాడనుకుంటే తండ్రి పకపకా నవ్వడం వారికి ఆగ్రహాన్ని తెప్పిం

చింది.

"మీ అమ్మ మాటలు నిజమేరా? డాక్టర్ అన్న ప్రతి మాటా యదార్థం" చిద్విలాసంగా నవ్వుతున్న తండ్రిని చూసి భయంతో నోరు తెరిచారు.

శ్రీనివాసరావు కాస్త మంచి నీళ్లు తాగి స్థిమితంగా కూర్చుని చెప్పడం మొదలుపెట్టాడు.

"ఆరోజు డాక్టర్ అన్న మాటలు మీ అమ్మ విన్నదనే సంగతి నాకు తెలియనే తెలీదు. కనీసం దాని నిజానిజాలు నన్ను కూడా అడగక తనలో తానే కుమిలిపోతూ మీ అందరినీ రప్పించాకా తన బాధ మీతోనైనా చెప్పింది. లేకుంటే తను పెంచుకున్న భయాందోళనలు ముదిరి పాకాన పడి ఏ డిప్రెషన్ లేక గుండె, బ్రెయిన్‌లకు ఎఫెక్ట్ అయ్యేది."

తండ్రి మాటలకు తికమక పడి "నస మాని అసలు సంగతి చెప్పు నాన్నా" అన్నారు అందరూ అసహనంగా.

"ఆరోజు ఏం జరిగిందంటే నేను రిపోర్టు తీసుకుని లోపలకు వెళ్లాను. అప్పటికే లోపల ఇంకెవరో పేషెంట్, వాళ్ల తాలూకు వారు ఉండడంతో వెనక్కి వచ్చేయబోతుంటే ఆ డాక్టర్ నాకు బాగా తెలిసినవాడు కావడంతో నన్ను పిలిచి విష్ చేసి "ఫర్వాలేదు. కూర్చోండి. వీళ్లని పంపించి మిమ్మల్ని చూస్తాను" అని నన్ను కూర్చోమని అంతకుముందున్న పేషెంట్ తాలూకు రిపోర్ట్సుని చూడసాగారు.

తన చేయి దాటిపోతున్న కేసును చూస్తే ఏ డాక్టర్‌కైనా ఇరిటేషన్, బాధగా ఉంటుంది. బహుశా అంతకుముందే ఆ పేషెంట్‌ని హెచ్చరించినా పట్టించుకుని ఉండరు. అందుకే డాక్టర్‌కి కోపం వచ్చి పెద్ద గొంతుతో మాట్లాడాడు. అవి బయటకి కూడా వినిపించి ఉంటాయి. అంతకుముందే నేను లోపలకు వెళ్లడంతో ఆ జబ్బేదో తనకే వచ్చి పదిరోజుల్లో పోతున్నట్లుగా మీ అమ్మ అన్వయించుకుంది. అర్థంలేని భయాలతో తను భయపడి మనలను భయపెట్టింది."

"మరి... నేను లోపలకు తొంగి చూస్తే మీరొక్కరే కనపించారు. మందు వ్రాసివ్వండి అంటున్నారు" అంది ఇంకా మొగుడి మాటలమీద పూర్తిగా నమ్మకం కుదరక.

"తొంగి చూడడం దేనికి? అప్పుడే లోపలకువచ్చి డాక్టర్‌ని కలిస్తే నీకీ అనుమానం వచ్చి ఉండేది కాదుగా"

"ఏమోనండీ... అంతదూరం ఆలోచించలేదు. డాక్టర్ మాటలు విన్నాక అవన్నీ నా గురించే అనుకున్నాను. అదీగాక మీరు అసలు విషయం నాతో చెప్పక దాచి పెట్టారని కోపంకూడా వచ్చింది. పిల్లలకు నగలు పంచేసి మీ మీ గురించి అప్పగింతలు పెట్టాను."

జరిగిన విషయం పూర్తిగా అర్థమయ్యాక అనుమానపు మబ్బులు వీడిపోవడంతో ఆ కుటుంబ సభ్యుల మధ్య నవ్వుల జడివాన మొదలయింది.

హాతోస్మి! ఎంత పని జరిగింది? ఇప్పటికైనా ఆవిడ తన మనోవ్యధని బయటపెట్టింది కాబట్టి సరిపోయింది. లేకుంటే ఆవిడ మనసులోనే తన బాధని, భయాన్ని అణుచుకుని ఉంటే మనోవ్యాధి ముదిరి చివరకు ఏమయ్యేది? తనకి ఏ జబ్బూలేదని కేవలం అపోహవలనే కృంగిపోయిందని రూఢి అయ్యాక ఆదిలక్ష్మి మంచంమీద నుండిలేచి వంటింట్లోకి జొరబడింది.

"ఈ వారంరోజులూ సరైన తిండి తిప్పలు లేక నాతోపాటు మీరూ పస్తున్నారు. ఉత్తి పుణ్యానికి మిమ్మల్నందర్నీ భయపెట్టాను. ఉండండి మీ అందరికీ మంచి విందు భోజనం ఏర్పాటు చేస్తాను" అంది హుషారుగా నవ్వుతూ.

కూతుళ్లు, కోడళ్లు జరిగినదానికి పకపకా నవ్వుతూ వంటగదిలోకి ఆమెను అనుసరించారు. సరైన సమయంలో నిజం బయటపడి కథ సుఖాంతమైంది.

అలా కాకుండా నిజంగా తమకి రోగముందని, అతి త్వరలో తను చనిపోవడం ఖాయమని తెలిసిన బలహీన మనస్కులు ఏమైనా అఘాయత్యం చేసుకున్నా లేక భయంవలన హార్టు ఫెయిలయినా ఆ పాపం ఎవరిది? అటువంటి అపోహకి కారణమైన డాక్టర్‌దా? లేక పేషెంట్ సమక్షంలో కాక విడిగా వెళ్లి కలసిన రోగి బంధువుదా?

డాక్టర్ బాబులూ! ఒక్క విషయం ఆలోచించండి. ఒక కేసు గురించి సీరియస్‌గా చర్చిస్తున్నప్పుడు మీకు ఎంత బాగా పరిచయమున్నా సరే వేరే రోగి తాలూకు వారిని లోపలకు అనుమతించక కాసేపు వెయిట్ చేయించండి. లేదా తరువాత జరిగే పొరపాటు గ్రహపాటుగా మారితే హాతోస్మి అంటూ మీరే తలలు పట్టుకొనవలసి వస్తుంది.

★

## ఎత్తయిన వంతెన

ప్రపంచంలోకెల్లా ఎత్తయిన వంతెన ఫ్రాన్స్‌లో ఫేడ్స్ వద్దనున్న రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి. సముద్ర మట్టానికి 430 అడుగుల ఎత్తున వున్న ఈ వంతెన పొడవు 472 అడుగులు.

## పదిమందితో కాపురం

కారిబీట్ ద్వీపకల్పంలో ఏంటీ గుహాఅవ్‌పెంట్స్ అనే దీవి ఉంది. అక్కడ పెళ్లిళ్ల ఆచారంలేదు. ఒక్కో పురుషుడికి పదిమంది భార్యలుంటే ఒక్కో స్త్రీకి ఆరేడుగురు భర్తలుంటారు. 80 వేల జనాభాగల ఆ దీవిలో అంతా అలాగే ఉంటారు. కానీ ఒకరికి ఇంకొకరితో సంబంధాలున్నాయని తెల్సినా ఎవరూ దానిని తప్పుగా తీసుకోరు!

## వేలిముద్ర చక్రవర్తి

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని పాలించిన మొదటి జార్జికి చదువు రాలేదు. పూర్తిగా నిరక్షరాస్యుడు. ఈయన శాసనాలపై సంతకం పెట్టలేక వేలిముద్రలు వేసేవాడట.

## తరచుగా వినిపించే పాట

1893లో ఇద్దరు లొజివెల్లీ టీచర్లు తమ క్లాసు పిల్లల్ని గ్రీట్ చేస్తూ వ్రాసి పాడిన పాట 'హేపీ బర్త్‌డే టూ యూ' సినిమాల్లోనూ, నిజ జీవితంలోనూ ఎక్కువ వాడుకలో వుంది.

-విమలారామం

